ఆధునిక వైద్యంతో అమ్మతనం

- ఆధునిక జీవనశైలితో మహిళల్లో పెరుగుతున్న వంధ్యత్వ సమస్యలు
- ఆందోళన వద్దంటున్న వైద్య నిపుణులు
- నేడు అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



గుంటూరు మెడికల్: అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. అయితే, నేటి ఆధునిక జీవనంలో దానికి ఎంతో మంది దూరమవుతున్నారు. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేక బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అలాంటి వారికి నేడు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో సులువుగా చాలా మంది సంతానం పొందుతున్నారు. గుంటూరులో సంతానం లేని వారికి వైద్యసేవల్ని అందించేందుకు 20 వరకు ఆస్పత్రులు ఉన్నాయి. అక్కడ ఎంతో మంది దంపతులు చికిత్స పొంది సంతానం పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంతానం లేకపోవటానికి గల కారణాలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలు వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు అధికమే...

ప్రస్తుతం వంద మంది మహిళల్లో సుమారు 30శాతం సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్నారు. ఉమ్మడి గుంటూరులో 250 మంది గైనకాలజీ వైద్యులు ఉండగా, వీరి వద్దకు ప్రతిరోజూ ఇద్దరు లేదా ముగ్గురు సంతానం కోసం వచ్చే వారు ఉంటున్నారు.

పిల్లలు పుట్టకపోవడానికి కారణాలు

పెళ్లైన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవడాన్ని వంధ్యత్వం(ఇన్‌ఫెర్టిలిటి) అంటారు. ఆడవాళ్లలో సంతాన లేమికి అండం విడుదల అవ్వకపోవడం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవడం, పీసీఓడీ, జనైటైల్ టీబీ, అలవాట్లు, అధిక మానసిక ఒత్తిడి, అధిక బరువు, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనక పోవడం, మూఢ నమ్మకాలు, సెక్స్‌పై అవగాహన లేకపోవడం తదితర కారణాలు ఉన్నాయి.

అత్యాధునిక వైద్య పద్ధతులు

సంతానం కోసం చింతించే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) : ఈ విధానంలో సంతానం కోసం భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారైయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశాలు ఉంటాయి.

భర్త శుక్ర కణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుంచి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.

ఇంట్రాయుటైన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ): ఈ విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. ఈ విధానంలో 10 నుంచి 20శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది.

భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్య రీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా(అద్దెగర్భం) సంతానం పొందవచ్చు. ఈ విధానంలో 30 నుంచి 40శాతం పిల్లలు పుట్టే అవకాశం ఉంది. అండం విడుదల కాని సందర్భాల్లో, పురుషకణాలు తక్కువగా ఉన్న సమయాల్లో మందుల ద్వారా సమస్యను నివారించి పిల్లలు పుట్టేవిధంగా చేస్తున్నారు. ఈ విధానంలో 5 నుంచి 10శాతం పిల్లలు పుట్టే అ వకాశం ఉంది.

మగవారిలోనూ సమస్యలు

మగవాళ్లలో సుఖవ్యాధులు, టీబీ, స్మోకింగ్, మద్యం, మత్తుపదార్థాల వినియోగం, బీర్జాలకు గాయాలు, దెబ్బలు తగలడం, అంగం సైజుల్లో తేడాలు, పని ఒత్తిడి, కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటల పాటు వినియోగించడం, రాత్రి వేళల్లో ఎక్కువగా సెల్ ఫోన్ మాట్లాడటం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం, హార్మోన్ సమస్యలు, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

నేడు అందుబాటులో పలు చికిత్సలు



పిల్లల లేమితో బాధపడేవారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. నూతన వైద్య విధానంలో సంతానలేమి సమస్యతో వచ్చిన వారు ఆస్పత్రిలో వైద్యం పొందిన పిదప సంతానం పొందారు. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టేందుకు 23 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయస్సు చాలా అనుకూలం. గర్భం దాల్చేందుకు ముందుగానే ఫోలిక్ యాసిడ్ మింగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ షమా సుల్తానా,
సీనియర్ గైనకాలజిస్ట్, గుంటూరు

గర్భం దాల్చగానే వైద్య పరీక్షలన్నీ చేయించాలి



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్ ల్యూసెన్సీ (ఎన్‌టి) స్కాన్ చేయించాలి. డబుల్‌మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, షుగర్ టెస్ట్, రక్తహీనత టెస్ట్ చేయించాలి. 18 వారాల నుంచి ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి. గర్భం దాల్చిన 20 నుంచి 22 వారాల్లోగా టిఫా స్కాన్ పరీక్ష చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాల్ని తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, షుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు ఆల్ట్రాసౌండ్, పెట్, సీటీజీ స్కాన్‌లు చేయించాలి.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి,
స్త్రీ,ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, గుంటూరు

క్లుప్తంగా

విధుల్ని బాధ్యతతో నిర్వహించాలి: జేసీ



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ శాఖల అధికారులంతా విధుల్ని బాధ్యతతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా రవాణా, ఆహారం, నిత్యావసర సరుకుల సరఫరా తదితర అంశాల్లో చేసిన తనిఖీల వివరాల్ని సక్రమంగా అందించాలని ఆమె సూచించారు. పెట్రోల్ బంకులు, రేషన్ దుకాణాలు, హోటల్స్, రైస్ మిల్లర్లు ప్రజలకు అందించే సేవల్లో లోపాల్ని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా రెండో శుక్రవారం నిర్వహించే సమావేశాలకు తప్పక రావాలని చెప్పారు. సమావేశంలో డీఎస్‌ఓ పద్మశ్రీ , సివిల్ సప్‌లైస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెన్స్ దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని అన్ని కాలనీల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని డీ–1 ఈఈ శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు గ్రూప్–2 ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఈనెల 22న ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న సదస్సులో సీనియర్ అధ్యాపకులతో గ్రూప్–2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 91332 37733, 040–35052121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు అడ్‌హాక్ పద్ధతిలో చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల్ని అడ్‌హాక్ పద్ధతిలో చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా, సర్దుబాటు పేరుతో తీవ్ర గందరగోళ పరిస్థితులు కల్పించడం సరికాదని చెప్పారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ షేక్ బాజీ, రాష్ట్ర కౌన్సిలర్ ఎంపీ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల శ్రీనివాసరావు, హెడ్ క్వార్టర్ కన్వీనర్ వై.శ్యాంబాబు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని శ్రీ సీతారామస్వామి మందిర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం , అగ్నిప్రతిష్ట, వాస్తు హోమం, వాస్తు క్రమణిక, పంచగవ్యస్థాపన, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను మందిర సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, రామశంకరరావు, ప్రవీణ్ కుమార్, మోహన్‌బాబు, నరసింహారెడ్డి, కట్టా శీను, కోదండరామిరెడ్డి, ఆనంద్, పర్యవేక్షించారు.

ఫిట్స్‌పై విద్యార్థులకు అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూలు విద్యార్థులకు శుక్రవారం ఎపిలెప్సీ (ఫిట్స్)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ షాహీన్ మొహమ్మద్ ఎపిలెప్సీ అంటే ఏమిటి ? దాని గురైన విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిని నయం చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాంబాబు, మోటివేషనల్ స్పీకర్ హర్ష శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఫ్లిప్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, తదితరులు

పట్నంబజారు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. పర్యావరణ ప్రగతి – మనందరి లక్ష్యం కావాలన్న సందేశంతో విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించే దిశగా ఐటీసీ, ఎమ్మెస్కే, ఫీనిక్స్ సంస్థలు ప్రత్యేకంగా ప్రచురించిన ఫ్లిప్ బుక్‌ను శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అతివృష్టి లేదంటే అనావృష్టి, కరువు, కాటకాలకు ప్రధాన కారణం ప్రకృతిలో సమతుల్యత లోపించడమేనని తెలిపారు. ప్రకృతిని కాపాడడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో 20కోట్ల మొక్కలు నాటిందని గుర్తు చేశారు. కేవలం ప్రభుత్వం పూనుకున్నంతనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కాదనీ, ప్రజలంతా భాగస్వాములైనప్పుడే విజయవంతమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సుస్థిరమైన పరిష్కార మార్గాలు తెలుసుకుని ప్రభుత్వానికి సహకరించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. అందమైన, ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కారానికి ప్రతి ఒక్కరికి సహకారం ఎంతో అవసరమని చెప్పారు. పిల్లలకు ఫ్లిప్ బుక్స్ ద్వారా అవగాహన కల్పించేందు సిద్ధమైన నిర్వాహకుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఐటీసీ, ఎమ్మెస్కే, ఫీనిక్స్ మేనేజర్ కె.నారాయణ, నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ టి.తిరుపతిరెడ్డి, ప్రతినిధి యస్.ప్రదీప్ కుమార్, మిర్చియార్డు వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పార్టీ నేతలు గులాం రసూల్, వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ సుభాని, సోమి కమల్, బీడింగ్ సుభాని, రబ్బాని, వెంకట్రావు, కోటేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

డీటీసీ షేక్ కరీం



ప్రతిజ్ఞ చేస్తున్న డ్రైవర్లు

పట్నంబజారు: వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో లారీ, స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ రహదారి భద్రత సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో జరిగిన 1071 రోడ్డు ప్రమాదాల్లో 398 మంది మృతి చెందారని, 1011 మంది గాయపడి వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపారని వెల్లడించారు. విధులకు బయలుదేరే ప్రతి డ్రైవర్ ఒక్కసారి తన కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.రహదారి ప్రమాదరహిత జిల్లాగా గుంటూరును నిలపాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేయాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తమ ప్రయాణంలో ఏకాగ్రత కలిగి ఉండాలని చెప్పారు. రహదారి భద్రత సూచనలు పాటిస్తూనే.. ఇతర వాహనాల్ని ఓవర్ టేక్ చేయాలని సూచించారు. విద్యాసంస్థల డ్రైవర్లు బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు జీవితాలు తమపై నమ్మకంతో వాహనంలో ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. రోడ్ సేఫ్టీ ఎన్జీవో రాజకుమారి మాట్లాడుతూ ప్రమాదాలబారిన పడిన ఎంతో మంది జీవచ్ఛవాలుగా బతుకుతున్నారని, ఇటువంటి పరిస్థితులు మరెవ్వరికీ రాకూడదని చెప్పారు. సదస్సులో ఎంవీఐలు రాఘవరావు, గోపాల్, మల్లీశ్వరి, సౌజన్య, ఏవో సత్యక్రాంతి, సిబ్బంది రాజీవ్ పాల్గొన్నారు.

బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇద్దరు బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించి బెదిరించిన ఓ వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కోబాల్ట్‌పేటకు చెందిన దర్శి ఏడుకొండలు అదే ప్రాంతానికి చెందిన తొమ్మిది, పది సంవత్సరాల వయస్సున్న ఇద్దరు బాలికలతో స్నేహంగా మెలుగుతున్నాడు. మాయమాటలు చెప్పి ఈనెల 12న ఇంటికి తీసుకెళ్లి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలికలు కేకలు వేసేందుకు ప్రయత్నించగా ఇద్దరి నోటిలో గుడ్డలు కుక్కి కొట్టి బెదిరించాడు. బాలికలు నిందితుడి నుంచి తప్పించుకుని బయటపడ్డారు. తొలుత భయపడి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పలేదు. బాలికల ప్రవర్తనలో మార్పు గమనించిన వారు బుజ్జగించి ధైర్యం చెప్పడంతో జరిగిన విషయం చెప్పారు. దీంతో తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌పై పోలీసులు దాడి

గుంటూరు ఈస్ట్: అమరావతి రోడ్డులోని రాజధాని హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న అరండల్‌పేట శుక్రవారం దాడి చేశారు. ఇద్దరు మహిళలను, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మహిళను మోసం చేసిన వ్యక్తిపై .....

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి ప్రేమ పేరుతో మహిళను మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పెదకాకానికి చెందిన రోహన్ కుమార్ ఆటో డ్రైవర్‌గా జీ వనం సాగిస్తుంటాడు. ఫోనులో ఏర్పడిన పరిచయంతో తెలంగాణకు చెందిన ఓ మహిళకు గుంటూరులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అరండల్‌పేట స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో ఆమెతో ప్రేమిస్తున్నానని చెప్పి కొద్ది రోజులు సహజీవనం చేశాడు. అనంతరం పెళ్లికి నిరాకరించాడు. తాను మోసపోయినట్లు నిర్ధారించుకున్న ఆ మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఎన్జీవో బురద జల్లడం ఆపాలి

ఏపీజీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు మెడికల్: తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణపై వ్యక్తిగత దూషణలకు దిగడం, తమ సంఘ గుర్తింపు రద్దు చేయాలన్న ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా తీవ్రంగా మండిపడ్డారు. ఏపీ ఎన్జీవో సంఘం నేతల వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీతభత్యాల కోసం చట్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నరును అడగడం ప్రజాస్వామ్యయుతమైన హక్కులలో భాగమే తప్ప విరుద్ధం కాదని తెలిపారు. ఏపీఎన్జీవో సంఘ భవనాల్ని వ్యాపార కేంద్రాలుగా మార్చేసి లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ, ప్రభుత్వానికి జమా ఖర్చులు సైతం చూపించకుండా పన్నులు ఎగకొడుతున్నారన్న ఫిర్యాదుకు నేటికీ తమ సంఘం కట్టుబడి ఉందని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్.శివారెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరావు పెదరత్తయ్య, అమరావతి తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు చిత్రలేఖన పోటీలు, ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ సహకారంతో శనివారం సాయంత్రం 4.00 గంటలకు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 17వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు, చిత్రకళా ప్రదర్శన ప్రారంభిస్తున్నట్లు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ కె.పి. బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రముఖ చిత్ర కళాకారులు గీసిన చిత్రాల ప్రదర్శనతో పాటు పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. చిత్ర కళాభిమానులు, యువత, విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

అలరించిన హాస్య వల్లరి



నాటకం పేరేంటి నాటికలోని ఓ సన్నివేశం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళా వేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ శత జయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు ఎల్వీఆర్ రీడింగ్ రూమ్ నిర్వహణలో వరికూటి శివప్రసాద్ రచన, దర్శకత్వంలో హాస్యవల్లరిలో భాగంగా ప్రదర్శించిన 'పూజకు వేళాయే', 'నాటకం పేరేంటి?' నాటికలు అలరించాయి. విజయవాడ హర్ష క్రియేషన్స్ నిర్వహణలో మునిపల్లి విద్యాధర్ రచన, కత్తి శ్యామ్ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'స్వర్ణ కమలాలు' నాటిక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అనంతరం కావలి చెందిన నందమూరి అభిమాని మలిశెట్టి వెంకటేశ్వర్లుకు ఎన్టీఆర్ శత జయంతి పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముప్పాళ్ల సుబ్బారావు, పుల్లడి సుందరం బాబు, నుసుము నాగభూషణం పాల్గొన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

బజరంగ్ ఫౌండేషన్ కంటి వైద్యశిబిరం 27కు వాయిదా

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించతలపెట్టిన ఉచిత కంటి వైద్య శిబిరం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరాన్ని పెదకాకాని శ్రీ వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 27వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

● లెక్కల మాస్టార్‌గా కలెక్టర్



గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ లెక్కల మాస్టార్‌గా పాఠాలు బోధించారు. పట్టాభిపురంలోని రవీంద్రనగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థుల తరగతి గదిని పరిశీలించారు. సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ) పరీక్షల్లో వచ్చిన మార్కుల గురించి ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గణితంలో 95 మార్కులు సాధించిన మీర్ సైదా, ఇంగ్లీష్‌లో 89 మార్కులు పొందిన యూసఫ్ లుక్మాన్, బి. గిరిధర్‌తో పాటు 86 మార్కులు పొందిన బి. సంరక్షితను అభినందించి, వారికి పెన్నులను బహూకరించారు. ఏప్రిల్‌లో జరిగే ఫైనల్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా ప్రీ-ఫైనల్ పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేస్తానని చెప్పారు. విద్యార్థుల్ని గణిత శాస్త్రంపై ప్రశ్నలు అడిగారు. సబ్జెక్టు కష్టతరం కాదని, మనసు పెట్టి అర్థం చేసుకుంటే చాలా సులభమని సూచించారు. డ్రాయింగ్ క్లాసులో విద్యార్థులు వేసిన చిత్రాల్ని చూసి అభినందించారు. అనంతరం మన బడి నాడు-నేడు ద్వారా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉపాధ్యాయులు ఎన్‌బీ తిలక్, జీఎస్ రామకృష్ణ ఉన్నారు.

ఆర్ఎస్ఐ, కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందనలు



కానిస్టేబుల్ చంటిని, ఆర్ఎస్ఐ సుధీర్ కుమార్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగి పోలీస్ శిక్షణ కళాశాలలో జరిగిన బాంబ్ డిస్పోషల్ డిటెక్షన్ స్క్వాడ్ శిక్షణ సెంటర్‌లో గుంటూరు ఆర్ఎస్ఐ సుధీర్‌కుమార్, ఏఆర్ కానిస్టేబుల్ చంటి ప్రతిభ చాటారు. గుంటూరు జిల్లాకు మొదటి బహుమతి సాధించిన ఆర్ఎస్ఐ, కానిస్టేబుల్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, ఆర్ఐలు రాజారావు, రాఘవయ్య పాల్గొన్నారు.

జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు ప్రశంసలు



క్యాన్సర్ వార్డులో పరికరాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు సేవలు ప్రశంసనీయమని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ గడ్డిపాటి జగదీష్‌బాబు తెలిపారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను శుక్రవారం డాక్టర్ జగదీష్‌బాబుతో పాటు వారి కుటుంబ సభ్యులు గడ్డిపాటి నెహ్రూబాబు, డాక్టర్ గడ్డిపాటి స్వరూప రాణి, డాక్టర్ నీత చంద్రావలి సందర్శించారు. ఇటీవల నాట్కో ట్రస్ట్‌తో కలిసి గడ్డిపాటి కస్తూరిదేవి, డాక్టర్ రామమోహన్‌రావు, శివరామకృష్ణబాబు జ్ఞాపకార్థం క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక మమ్మోగ్రఫి పరికరాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కి గడ్డిపాటి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. నాట్కో సెంటర్ సమన్వయకర్త అశోక్ కుమార్ క్యాన్సర్ రోగులకు అందుతున్న సేవల్ని గడ్డిపాటి కుటుంబ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్

ఏఎన్‌యూ: ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల 2022–23 విద్యా సంవత్సరం బీఫార్మసీ మొదటి సంవత్సర తరగతుల్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు అధికమవుతున్న ప్రస్తుత తరుణంలో ఫార్మసీ రంగం ప్రధాన పాత్ర వహిస్తోందని చెప్పారు. ఫార్మసీ కళాశాలకు అవసరమైన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి మాట్లాడుతూ యువత సమాజాభివృద్ధికి లక్ష్యంగా ముందుకుసాగాలను సూచించారు. ఓఎస్‌డీ కె.సునీత మాట్లాడుతూ మందుల ప్రభావాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, రోగుల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర వహించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ నాగరాజు, కాలేజీ ప్రిన్సిపాల్ ఏ. ప్రమీలరాణి పాల్గొన్నారు.

త్యాగయ్య ఆరాధనోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజస్వామి కళా వేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో సంగీత జగద్గురు శ్రీ త్యాగబ్రహ్మ 176వ ఆరాధనా సంగీత మహోత్సవాలు శుక్రవారం వేదస్వస్తితో వైభవంగా ప్రారంభమయ్యాయి. సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి. విజయ, డాక్టర్ కమల, డాక్టర్ నీలిమ, ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. లఘు కచేరీలో భాగంగా కళాకారులు గాత్రం, వీణపై త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీతాభిమానుల్ని అలరించారు. వయోలిన్ సోలో కచేరీలో ఆర్. దినకర్ అనేక త్యాగరాజ కీర్తనల్ని ఆలపించి ఆహూతుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం సంగీత సన్మండలి ఆధ్వర్యంలో కళాకారుల్ని సత్కరించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది విజయలక్ష్మి, డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, లలితాదేవి తదితరులు పర్యవేక్షించారు.